సాక్షి అనకాపల్లి

బుధవారం। 10। మే। 2023



విషాదం


కశింకోట ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. లారీ ఢీకొని ఆటో డ్రైవర్, కూరగాయల వ్యాపారి మృతి చెందారు.

8లో



సీఎం పర్యటనకు ఏర్పాట్లు

విశాఖ: సీఎం జగన్ ఈ నెల 11న నగరంలో పర్యటించనున్న ప్రాంతాలను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పరిశీలించారు.



స్థాయీ సంఘ సమావేశం

విశాఖ: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈనెల 12న నిర్వహించనున్నారు. 15 అంశాలు చర్చకు రానున్నాయి.

న్యూస్‌రీల్

క్వారీ నిర్వహణపై విచారణ



విచారణ చేస్తున్న మైన్స్ అధికారులు

మాకవరపాలెం: క్వారీ నిర్వహణపై మైన్స్ అధికారులు విచారణ చేశారు. జి.కోడూరు రెవెన్యూ 332 సర్వే నంబర్‌లో ఉన్న 24 హెక్టార్ల క్వారీని మండలంలోని తామరం గ్రామానికి చెందిన రాజాసాగి నాగవెంకటసూర్యనారాయణకు గతంలో లీజుకు ఇచ్చారు. కొంతకాలం జరిగిన క్వారీ పనులను ఏడాదికిపైగా నిలిపివేశారు. తిరిగి గత నెలలో క్వారీని ప్రారంభిస్తుండగా కొందరు అడ్డుకున్నారు. క్వారీ కారణంగా పంట భూములకు ఇబ్బందులు ఉన్నాయని అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో మంగళవారం గనులశాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సాంబశివారెడ్డి విచారణ చేశారు. లీజుదారులతోపాటు స్థానికులు తెలిపిన అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆయన తెలిపారు.

వయోవృద్ధుల కమిటీ ఏర్పాటుకు చర్యలు

తుమ్మపాల : వయోవృద్ధుల సమస్యలు, సంరక్షణ కొరకు ఏర్పాటుచేయనున్న జిల్లాస్థాయి వయోవృద్ధుల కమిటీలో ఆరుగురు ఎన్‌జీవోలను సభ్యులుగా చేర్చుకోనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాకులు జీవీబీ జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో ఏడుగురు జిల్లా అధికారులు, వయోవృద్ధుల కోసం పనిచేస్తున్న ఎన్‌జీవోల నుంచి ముగ్గురిని తీసుకోవాల్సి ఉందన్నారు. వారిలో ఒక మహిళా ఉండాలన్నారు. విశిష్టత కలిగిన ముగ్గురు వయోవృద్ధులను కమిటీలో తీసుకుంటామన్నారు. తల్లిదండ్రుల పోషణ, రక్షణ చట్టం 2007లోని రూల్ 23ని అనుసరించి కొత్తగా ఏర్పడిన జిల్లాలో జిల్లా స్థాయి వయోవృద్ధుల కమిటీ ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టామన్నారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఎన్‌జీవోలు ప్రకటన వెలువడిన ఏడు రోజుల్లో తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరింత సమాచారం కోసం 9493291018 నంబర్లో మాట్లాడవచ్చన్నారు.

12న చోడవరంలో మెగా జాబ్ మేళా

చోడవరం రూరల్: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు మంగళవారం తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు పలు కంపెనీల్లో ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నేతృత్వంలో జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభ మవుతుందన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉన్న నిరుద్యోగులు ఈ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మెడ్ ప్లస్, వరుణ్ మోటార్స్, రిలయన్స్ జియో, శర్వాణి స్వీట్స్, ఆక్వా సేఫ్ వాటర్ టెక్నాలజీస్, అరబిందో ఫార్మ, డెక్కన్ కెమికల్స్, పానసోనిక్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, క్వెస్ కార్ప్, ది ప్లేస్‌మెంట్ పార్క్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7981102224, 9014765287, 9494791935 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. టెన్త్, ఐటీఐ నుంచి పీజీ వరకు విద్యార్హతలు ఉన్నవారు ఉద్యోగ మేళాకు హాజరు కావచ్చన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో, డివిజన్ అప్రోపియేట్ అథారిటీ చైర్మన్ ఎ.జె.చిన్నికృష్ణ అన్నారు. పీసీ అండ్ పీఎన్డీటీ అమలుపై తన కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. జిల్లాలో 58 స్కానింగ్ సెంటర్లలో తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతున్నందున స్త్రీ పురుష నిష్పత్తిలో తేడాలు వస్తున్నాయని చెప్పారు. దీంతో ఎదురయ్యే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. లింగనిర్ధారణ పరీక్ష చేయించారనే సమాచారం తెలిస్తే 102, 104 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ ఎం.శారదాబాయి, గైనకాలజిస్ట్ విజయ్‌కుమార్, లీగల్ అడ్వయిజర్ హరిత, డీపీఆర్వో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

వేసవి వస్తోందంటే చాలు మామిడి పళ్ల కోసం ఎదురుచూస్తాం. ఒకపక్క ఎండలతో ఉసురుసురంటూనే మధుర ఫలాలను ఆస్వాదిస్తాం. ధరలు పెరిగినా మామిడి పండు తినాల్సిందే. ఆ పండుకున్న క్రేజ్ అలాంటిది. మామిడి సాగుతో రైతులు, ఎగుమతులతో ఎంతోమంది వ్యాపారులు దీనిపై ఆధారపడి ఉన్నారు. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. దిగుబడి తగ్గింది. ఎగుమతులు మందగించాయి. **ధరల మాట ఎలా ఉన్నా రుచి తగ్గడంతో వినియోగదారులు కూడా నిరాశ వ్యక్తం చేస్తున్నారు.**

మామిడీలా..







ఈసారి మామిడి కాపు నిరాశాజనకం (ఇన్‌సెట్) ఎగుమతికి సిద్ధం చేస్తున్న మామిడి పండ్లు

- భారీగా తగ్గిన దిగుబడి
- మందగించిన ఎగుమతులు
- వెలవెలబోతున్న కమీషన్ దుకాణాలు
- రుచి తగ్గిన మధుర ఫలం
- పెదవి విరుస్తున్న మామిడి ప్రియులు

ధరలు పడిపోయాయిలా.. (టన్నుకు)

మామిడి రకం	గత ఏడాది	ఇప్పుడు
బంగినపల్లి	రూ.35 వేలు	రూ.25 వేలు
సువర్ణరేఖ	రూ.50 వేలు	రూ.30 వేలు
కలెక్టర్ రకం	రూ.25 వేలు	రూ.15 వేలు

నక్కపల్లి: మామిడి ఎగుమతులకు ఈ ప్రాంతం పెట్టింది పేరు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పాయకరావుపేట నియోజకవర్గం నుంచే ఇతర రాష్ట్రాలకు సరఫరా అవుతుంటాయి. నక్కపల్లి మండలంలో జాతీయరహదారి పక్కన చినదొడ్డిగల్లు, కాగిత, వేంపాడు పరిసర ప్రాంతాల్లో సుమారు 16 వరకు కమీషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మండలాల నుంచి కూడా ఇక్కడకు మామిడి కాయలు తెచ్చి విక్రయిస్తారు. ఇక్కడ కమీషన్ దుకాణాల యజమానులు వాటిని కటక్, భువనేశ్వర్, కలకత్తా, విశాఖపట్నం, విజయవాడ, చెన్నై వంటి పట్టణాలకు ఎగుమతి చేస్తుంటారు. డిసెంబరు నుంచే ఇక్కడ కమీషన్ దుకాణాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుంది. సమీపంలో ఉన్న తోటల యజమానులకు, మామిడి రైతులకు ఈ కమీషన్ వ్యాపారులు ముందస్తు పెట్టుబడులు పెడతారు. దిగుబడి వచ్చిన తర్వాత వారినుంచి కొనుగోలు చేస్తారు. అయితే ఈ ఏడాది పరిస్థితి నిరాశాజనకంగా ఉంది. వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పులు, పొగమంచు, తెగుళ్ల కారణంగా చాలా చోట్ల దిగుబడి తగ్గిపోయింది. మామిడి రైతులు, కమీషన్ వ్యాపారులు నష్టాలను చవి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

సగానికి పడిపోయిన దిగుబడి

ఉమ్మడి విశాఖ జిల్లాలో 25 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. అందులో పాయకరావుపేట నియోజకవర్గంలోనే 14 వేల ఎకరాల్లో సాగవుతోంది. నర్సీపట్నం, యలమంచిలి, మాడుగుల, చోడవరం నియోజకవర్గాలతోపాటు కొయ్యూరు, పద్మనాభం తదితర మండలాల్లో దాదాపు 12 వేల ఎకరాల్లో మామిడి పండిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 4 నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రతి ఏటా 1.25 లక్షల టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. ఉద్యానవన శాఖాధికారులు మాత్రం 75 శాతం దిగుబడిని మాత్రమే లెక్కకడతారు. ఈ లెక్కన దాదాపు 80 నుంచి 90 వేల టన్నుల దిగుబడి రావాల్సి ఉంది..కానీ ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల వల్ల దిగుబడి 50 శాతానికి పడిపోయింది.

ఈ ఏడాది ఎకరాకు 3 టన్నుల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పూత రావడం కోసం, పూత నిలబడటం కోసం, పిందె రావడం కోసం పిందె నిలబడటం కోసం, తెగులు రాకుండా ఉండటం కోసం ఇలా సీజన్‌లో ఐదు పర్యాయాలు పురుగుమందులు పిచికారీ చేస్తుంటారు. ఈ మందుల వల్ల మామిడిలో నాణ్యత, రుచి గణనీయంగా తగ్గిపోయిందని ఉద్యానవన శాఖాధికారులు రైతులు చెబుతున్నారు.

తీపి తగ్గిందెందుకు?

ఈ ఏడాది ఈ ప్రాంతంలో లభించే మామిడి కాయల్లో నాణ్యత లోపించిందని వ్యాపారులు చెబుతున్నారు. రుచి పెద్దగా ఉండటం లేదని వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. అధికంగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం వల్లే కాయ సైజు, నాణ్యత, రుచి తగ్గిపోయిందని, తెగులు కూడా ఎక్కువ వస్తోందని ఉద్యానవనశాఖాధికారులు చెబుతున్నారు. తోటల్లో ముందుగానే సస్యరక్షణ చర్యలు చేపడితే ఈ సమస్య ఉండదని చెబుతున్నారు.

మందగించిన ఎగుమతులు

- ప్రతి ఏటా చినదొడ్డిగల్లు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 40 వేల టన్నుల మామిడి ఎగుమతి అయ్యేది.
- ప్రతి కమీషన్ దుకాణం నుంచి రోజుకు 300 నుంచి 500 టన్నుల వరకు ఎగుమతులు జరిగేవి.
- ఈ ఏడాది 50 నుంచి 100 టన్నులు ఎగుమతి చేయడం కష్టతరంగా మారిందని కమీషన్ వ్యాపారులు చెబుతున్నారు.
- కలకత్తా, ఛత్తీస్‌గఢ్, కటక్, భువనేశ్వర్ నుంచి హోల్‌సేల్ వ్యాపారులు వస్తున్నా దిగుబడి లేకపోవడంతో ఎగుమతి చేయలేకపోతున్నామన్నారు.

పెట్టుబడి దక్కని దుస్థితి



నాకు 50 సెంట్ల మామిడి తోట ఉంది. ఇప్పటి వరకు నాలుగుసార్లు పురుగు మందులు, ఎరువుల కోసం రూ.6 వేలు ఖర్చు పెట్టాను. కాపు లేకపోవడంతో పెట్టుబడి అంతా నష్టపోవాల్సి వచ్చింది. అర టన్ను కూడా దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మా చుట్టుపక్కల రైతులందరిదీ అదే పరిస్థితి.

–నఖిరెడ్డి వెంకటరావు, చినరామభద్రపురం

అంతంతమాత్రంగా ఆర్డర్లు



లక్షలు వెచ్చించి పెట్టుబడులు పెట్టి తోటలు కొనుగోలు చేశాం. కమీషన్ దుకాణాలు పెట్టాం. ఈ ఏడాది దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. వచ్చిన సరకులో నాణ్యత లేకపోవడంతో ఆర్డర్లు అంతంతమాత్రంగానే వస్తున్నాయి. ప్రతి రోజు 30 టన్నులు ఎగుమతులు జరగాల్సి ఉండగా పది టన్నులకు మించి జరగడం లేదు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. రవాణా ఖర్చులు కూడా పెరిగిపోయాయి.

–తోట సత్తిబాబు, కమీషన్ వ్యాపారి

మితిమీరిన రసాయన ఎరువుల వాడకమే కారణం



ఈ ఏడాది మామిడి దిగుబడి అంతంతమాత్రంగానే ఉన్న మాట వాస్తవం. ఎక్కువగా పురుగుమందులు, రసాయన ఎరువుల వాడకం దిగుబడిపై ప్రభావం చూపుతోంది. తోటల్లో ముందుగానే సస్యరక్షణ చర్యలు చేపడితే ఈ సమస్య ఉండదు. తోటను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి, చెత్తను తొలగించి సకాలంలో దుక్కులు నీరు ఏర్పాటు చేస్తే తెగుళ్లబారి నుంచి కాపాడుకోవచ్చు. తోటలకు గాలి, వెలుతురు కూడా ఉండాలి. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుంది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఉచిత పంటల బీమా అమలు చేయాలని నిర్ణయించింది. రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి. వాతావరణ పరిస్థితులు ప్రకృతి వైపరీత్యాల వల్ల మామిడి పంటకు నష్టం వాటిల్లితే రైతులకు పంటల బీమా కింద ఆర్థిక సాయం అందే అవకాశం ఉంది.

– ప్రభాకర్‌రావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి

అధికారుల 'స్పందన' బాగుండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ప్రత్యేకాధికారి నివాస్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, జేసీ జాహ్నవి

- 'జగనన్నకు చెబుదాం' ప్రతిష్టాత్మక కార్యక్రమం
- ఫిర్యాదులు రీ ఓపెన్ కాకుండా చూడండి
- జిల్లా ప్రత్యేక అధికారి జె.నివాస్

తుమ్మపాల: 'స్పందన' ఫిర్యాదులపై ప్రభుత్వ యంత్రాంగం స్పందన మెరుగ్గా ఉండాలని, బాధితులకు న్యాయం జరగాలని జిల్లా ప్రత్యేక అధికారి జె.నివాస్ అన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో తాడేపల్లి క్యాంపు ఆఫీసు నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అనకాపల్లి నుంచి పాల్గొన్నారు. అనంతరం నివాస్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో కూడా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై క్షుణ్ణంగా అవగాహన కల్పించాలన్నారు. టోల్‌ఫ్రీ 1902 నంబర్ అందరికీ తెలియాలని, జగనన్నకు చెబుదాం ఒక వినూత్నమైన ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, పారదర్శకతతో అర్హులకు నిజాయితీగా సంక్షేమ ఫలాలను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, పంచాయతీ శాఖలలో ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, వీటినైనంత త్వరగా పరిష్కరిస్తే ప్రజల్లో సంతృప్త స్థాయి పెరుగుతుందన్నారు. ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ చేసే అవకాశం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, జేసీ ఎం.జాహ్నవి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, డీఆర్వో పి.వెంకటరమణ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్లస్-2పై స్పెషల్ ఫోకస్ !



పాయకరావుపేటలో ప్లస్ టు హైస్కూల్ నిర్వహిస్తున్న బాలికోన్నత పాఠశాల

- ఇంటర్ ఫలితాలతో దిద్దుబాటు చర్యలు
- సబ్జెక్టు టీచర్ల భర్తీకి శరవేగంగా ఏర్పాట్లు
- అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు బొనాంజా
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 71 మందికి అవకాశం
- ఎంపికైన వారికి ఒక ఇంక్రిమెంట్

విశాఖ విద్య: ఉన్నత విద్యను చేరువలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటైన హైస్కూల్ ప్లస్ చదువులపై విద్యాశాఖాధికారులు ఫోకస్ పెట్టారు. 2022–23లో విద్యా సంవత్సరంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో తొమ్మిది చోట్ల హైస్కూళ్లనే జూనియర్ కాలేజీలు (హైస్కూల్ ప్లస్)గా గుర్తించి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులోకి తీసుకురాగా, తొలి ఏడాది 244 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.

ఆయా హైస్కూళ్లలోనే అర్హత గల సబ్జెక్టు టీచర్లతో ఇంటర్ మొదటి సంవత్సరం పాఠ్యాంశాల బోధన సాగించారు. కానీ వీటిలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. తొమ్మిది హైస్కూల్ ప్లస్ నుంచి కేవలం 11 మంది విద్యార్థులే ఉత్తీర్ణులయ్యారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్లస్ టూ హైస్కూళ్లను ఉన్నతాశయంతో ఏర్పాటు చేసినందున, వీటి బలోపేతంపై దృష్టి సారించారు.

సబ్జెక్టు టీచర్ల నియామకం

హైస్కూల్ ప్లస్‌ను నిర్వహిస్తున్న చోట పూర్తిస్థాయిలో సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండేలా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. 2023–24 విద్యా సంవత్సరానికి ముందుగానే ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్‌తో ఆర్థిక ప్రయోజనం కల్పించి, పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రభుత్వం 71 పోస్టులను మంజూరు చేసింది.

మంజూరైన పోస్టులు

తెలుగు	10	బోటనీ	10
ఇంగ్లీష్	10	జువాలజీ	10
గణితం	08	సివిక్స్	01
ఫిజిక్స్	10	ఎకనామిక్స్	01
కెమిస్ట్రీ	10	కామర్స్	01

మూడు జిల్లాల్లో ప్లస్ టూ స్కూళ్లు -13

విశాఖపట్నం

- గాజువాక జెడ్పీ హైస్కూల్,
- గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ (గర్ల్స్),
- మల్కాపురం జీవీఎంసీ పాఠశాల,
- గంగవరం జెడ్పీ హైస్కూల్,
- రాంపురం జెడ్పీ హైస్కూల్,
- సీతమ్మధారలోని ఎన్ఎంసీహెచ్ఎస్ పీటీ కాలనీ స్కూల్

అనకాపల్లి

- కూండ్రం, • పరవాడ, • పాయకరావుపేట, • యలమంచిలి జెడ్పీ హైస్కూళ్లు

అల్లూరి

- అడ్డతీగల, • దేవీపట్నం, • రాజవొమ్మంగి ఆశ్రమ పాఠశాలలు

దరఖాస్తు చేసుకోండి



ప్లస్ టూ హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లుగా పనిచేసేందుకు అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం కల్పిస్తున్నాం. ఆయా సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి ఉండాలి. 10వ తేదీ సాయంత్రంలోగా విశాఖపట్నం డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలి.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

బోధన మెరుగుపడుతుంది



ఇంటర్ కోర్సుల ప్రాధాన్యత దృష్ట్యా నాణ్యమైన బోధన అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్లస్ టూ స్కూళ్ల ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవటం వల్ల జిల్లా ఉత్తీర్ణత శాతంపై ప్రభావం చూపింది. సబ్జెక్టు టీచర్ల నియామకంతో బోధన మెరుగుపడుతుంది.

– రాయల సత్యనారాయణ, డీవీఈవో, విశాఖ జిల్లా

పీజీటీ ప్రమోషన్ ఇస్తే మరింత మేలు



ప్లస్ టూ హైస్కూళ్లను బలోపేతం చేసేలా ఉన్నతాధికారుల దృష్టి సారించటం శుభపరిణామం. పోస్టుగాడ్యుయేషన్ అర్హత గల స్కూల్ అసిస్టెంట్‌లకు శాశ్వత ప్రాతిపదికన పీజీటీగా ఉద్యోగోన్నతి కల్పిస్తే ఉపాధ్యాయ వర్గానికి మరింత మేలు చేసినట్లవుతుంది.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి, విశాఖపట్నం

నమ్మలేకపోతున్నా..

- మణిపూర్ నుంచి స్వగ్రామానికి చేరుకున్న యశ్వంత్
- ఆప్యాయంగా అక్కున చేర్చుకున్న తల్లిదండ్రులు



ఆప్యాయంగా కుమారుడికి తినిపిస్తున్న తల్లి ఆదిలక్ష్మి

రావికమతం: మా ఐఐటీ ప్రాంగణం ఎదురుగానే భవనాలకు నిప్పుపెట్టారు. ఆ మంటలు చూసి ఆందోళన చెందాము. గదుల్లోంచి బయటకు వెళ్లవద్దని చెప్పడంతో లోపలే ఉన్నాము. సరైన తిండి లేదు. మంచినీటి పైపుల్లోనూ విషప్రయోగం చేశారని వదంతులు రావడంతో ఐదు రోజులు నరకం అనుభవించాము. క్షేమంగా ఇంటికి చేరానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను.. అని మణిపూర్ నుంచి రావికమతం మండలంలోని స్వగ్రామం దొండపూడి చేరుకున్న కొప్పాక యశ్వంత్ తెలిపాడు. ప్రత్యేక విమానంలో సోమవారం హైదరాబాద్ చేరుకొని బస్సులో స్వస్థలానికి చేరిన వెంటనే తల్లిదండ్రులు ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. యశ్వంత్‌ను ముద్దాడిన తల్లి ఆదిలక్ష్మి ఆప్యాయంగా స్వీటు తినిపించింది. ఈ సందర్భంగా యశ్వంత్ ‘సాక్షి’తో మాట్లాడుతూ.. టీవీల్లో హింసాత్మక సంఘటనలు చూసి భయపడిన తల్లిదండ్రులు ఫోన్ చేసి జాగ్రత్తలు చెప్పడంతో మరింత ఆందోళనకు గురయ్యామన్నాడు. ఇంటర్నెట్ కూడా ఆపేశారని, ఏదోలా ఇంటికి చేరుకుంటే చాలనుకునే వాళ్లమని తెలిపాడు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి చొరవ చూపి రెండు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేస్తున్నారని తెలుసుకొని ఆనందపడ్డామని, ఆ వెంటనే అధికార్లు తమ నంబర్లకు ఫోన్ చేసి ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు సిద్ధం కావాలని చెప్పడంతో ఎగిరి గంతేశామని చెప్పాడు.

ప్రత్యేక బందోబస్తుతో విద్యార్థులందరినీ ఎయిర్‌పోర్టుకు చకచకా తరలించారని, ప్రత్యేక విమానంలో తనతోపాటు 100 మందికి పైగా విద్యార్థులు హైదరాబాద్ చేరుకున్నారని తెలిపాడు. అక్కడ అధికార్లు అన్నీ సమకూర్చారని, ప్రత్యేక బస్సులో స్వస్థలాలకు చేర్చుతామని ధైర్యం చెప్పారన్నాడు. ముఖ్యమంత్రి మేలు మరవలేనన్నాడు. తమ బిడ్డ భవిష్యత్ గురించి చాలా ఆందోళన చెందామని, నిద్రలేని రాత్రులు గడిపామని తల్లిదండ్రులు అప్పారావు, ఆదిలక్ష్మి చెప్పారు.

ఆకట్టుకున్న 'కలియుగ భగవాన్'

- నందడి చేసిన సినీ యూనిట్



డైరెక్టర్ గోపీకృష్ణకు కేక్ తినిపిస్తున్న బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి టౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి యువతరానికి ‘కలియుగ భగవాన్’ చిత్రం ఎంతగానో ఆకట్టుకుంటోందని గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక రాజా థియేటర్‌లో ఈ సినిమా 3 వారాలు దిగ్విజయంగా ప్రదర్శించిన సందర్భంగా మంగళవారం కేక్ కట్ చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సినిమా డైరెక్టర్ కోరుకొండ గోపీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొడ్డేడ మాట్లాడుతూ అనకాపల్లి, మునగపాక ప్రాంతాలు నాటకాలకు, సినీరంగానికి ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. మునగపాక గ్రామానికి చెందిన డైరెక్టర్ గోపీకృష్ణ కలియుగ భగవాన్ చిత్రం ద్వారా రాష్ట్ర ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. రానున్న రోజుల్లో యువతకు కావలసిన మరిన్ని చిత్రాలు తీయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిని నిర్మాతలు అల్లు శ్రీరాములునాయుడు, ఎస్.ఈశ్వరరావు, ప్రధాన పాత్రధారుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ, మాటల రచయిత విల్లూరి జగ్గఅప్పారావు, థియేటర్ యాజమాన్యం, తదితరుల పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్యాంక్ ఖాతాలో డబ్బులు మాయం

బుచ్చెయ్యపేట : ఓ మహిళ బ్యాంక్ ఖాతా నుంచి రూ.14 లక్షలు మాయమయ్యాయి. దీంతో ఆందోళన చెందిన ఆమె బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం కొమళ్లపూడికి చెందిన గొన్నా లక్ష్మికి రావికమతం యూనియన్ బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. ఆ అకౌంటు నుంచి 6వ తేదీన రూ.10 వేలు,7వ తేదీన రూ.4 వేలు నగదు విత్‌డ్రా అయినట్టు లక్ష్మి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. తాను విత్‌డ్రా చేయకుండా మెసేజ్ రావడంతో ఆందోళన చెందిన ఆమె మంగళవారం బ్యాంక్‌కు వెళ్లి సిబ్బందిని ఆరా తీసింది. అకౌంటు నుంచి రెండు రోజుల్లో రూ.14 వేలు నగదు డ్రా అయినట్టు బ్యాంక్ సిబ్బంది తెలపడంతో బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కుమారస్వామికి లక్ష్మి ఫిర్యాదు చేసింది. విచారణ చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతి

నర్సీపట్నం: స్థానిక ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్ డి.ఎ.రావు(50) ఆస్పత్రికి వెళ్లి స్పృహకోల్పోయి మృతి చెందాడు. స్వస్థలం నర్సీపట్నం మండలం, వేములపూడి. ఉద్యోగ రీత్యా పెదబొడ్డేపల్లిలో కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. తల విసురుతోందని ఇంటి వద్ద చెప్పి డిపోకు వెళ్లి సెలవు పెట్టి, ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. ఆస్పత్రి మెట్లపై కూర్చొని ముందుకు పడిపోయాడు. అక్కడ వారు లేపి సపర్యలు చేశారు. డాక్టర్ పరీక్షించి మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతుని కుటుంబ సభ్యులను డిపో మేనేజర్ ధీరజ్ పరామర్శించారు.

ఒడిశా నుంచి గంజాయి

- విశాఖ మీదుగా ఇతర రాష్ట్రాలకు రవాణా
- వినియోగం నుంచి విక్రయం వరకు గట్టి నిఘా
- తరచూ దాడులతో పెరుగుతున్న కేసులు
- విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ వెల్లడి
- గంజాయి నియంత్రణపై విశాఖ రేంజ్ పరిధిలోని ఎస్పీల సమీక్ష



మాట్లాడుతున్న విశాఖ పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, చిత్రంలో డీఐజీ హరికృష్ణ, విశాఖ రేంజ్ పరిధిలోని ఎస్పీలు

దొండపర్తి: 'ఒడిశా నుంచి.. రోడ్డు, రైలు, జల రవాణా సదుపాయాలు ఉన్న విశాఖ మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా అవుతోంది. వినియోగదారుల నుంచి విక్రయదారుల వరకు సప్లయ్ చైన్‌పై పోలీసుల డేగ కన్ను ఉంది. ఇందుకోసం పక్క రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయంతో అనేక మంది విక్రయదారులను అరెస్టు చేశాం. గంజాయి రవాణాకు అడ్డుకట్టవేయడంతో పాటు వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తాం' అని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ స్పష్టం చేశారు. పోలీస్ సమావేశ మందిరంలో విశాఖ రేంజ్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలతో డీఐజీ హరికృష్ణతో కలిసి ఒడిశా నుంచి గంజాయి రవాణా నియంత్రణపై సీపీ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో గంజాయి సాగుకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్, ఇతర ప్రాంతాలో గంజాయి సాగు చేసి.. అక్కడి నుంచి అనేక మార్గాల్లో విశాఖకు తీసుకువచ్చి.. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. అటువంటి వారిపై గట్టి నిఘా పెట్టినట్లు చెప్పారు. కేవలం వినియోగదారులను పట్టుకోవడమే కాకుండా వారికి ఎవరు విక్రయించారు? ఎలా వచ్చింది? ఇలా మొత్తం సప్లయ్ చైన్ లింక్‌పై దృష్టి పెడుతున్నామని వివరించారు. ఇటీవల పెందుర్తిలో పట్టుకున్న 450 కిలోల గంజాయి కేసులో అసలు సూత్రధారి కోరాపుట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు చెప్పారు. విశాఖ మీదుగా ఢిల్లీకి తీసుకువెళ్లే ప్రయత్నంలో వారిని పట్టుకున్నట్లు వెల్లడించారు.

గట్టి నిఘాతోనే పెరుగుతున్న కేసులు

గట్టి నిఘా పెట్టి విస్తృతంగా తనిఖీలు చేస్తున్న కారణంగానే కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని సీపీ తెలిపారు. ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గంజాయి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని కారణంగానే 2021లో 221 కేసుల్లో 2,700 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. 2022లో 255 కేసుల్లో 6,200 కేజీలు, ఈ ఏడాది నాలుగు నెలల్లో 88 కేసుల్లో 382 మందిని అరెస్టు చేసి 1800 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చి హోటళ్లలో బస చేసే వారిపై కూడా నిఘా పెట్టినట్లు చెప్పారు. హోటళ్లలో బస చేసే వారు ఎవరైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని.. నగరంలోని 510 హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. 165 ట్రాన్స్‌పోర్టు సంఘాలకు నోటీసులివ్వగా.. ఓ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ ప్రతినిధి ఇచ్చిన సమాచారంతోనే 40 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న వారిని అరెస్ట్ చేశామన్నారు. గంజాయి వినియోగించడం వల్ల కలిగేదుష్ప్రభావాలపై యువత, విద్యార్థులకు తెలియజేస్తూ.. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం : గంజాయిని రెగ్యులర్‌గా రవాణా, వ్యాపారం చేసే వారి జాబితాను సిద్ధం చేశామని సీపీ తెలిపారు. వీరిపై పీడీ యాక్ట్ అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. వీరిలో కొంత మంది జైలులో ఉన్నారని, వారు బయటకు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. ఒడిశా నుంచి విశాఖకు గంజాయిరాకుండా. అన్ని ప్రాంతాల్లోచెక్‌పోస్టులనుఏర్పాటుతనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు.

అల్లూరి జిల్లాలో నియంత్రణలో గంజాయి సాగు

గంజాయి సాగు జరిగే అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందని డీఐజీ హరికృష్ణ తెలిపారు. 2021లో పరివర్తన కార్యక్రమం ప్రారంభించిన తర్వాత గంజాయి సాగు నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అప్పట్లో ఆ జిల్లాలో సాగైన 7,515 ఎకరాలను గుర్తించి పూర్తిగా ధ్వంసం చేశామన్నారు. గంజాయి సాగు కారణంగా కలిగే అనర్థాలను గిరిజనులకు వివరించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించినట్లు చెప్పారు. గంజాయి సాగును పూర్తిగా నియంత్రించేందుకు ఇంటెలిజెన్స్ నుంచే కాకుండా శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా గుర్తించి 1,039 ఎకరాలను ధ్వంసం చేశామన్నారు. ప్రస్తుతం అల్లూరి జిల్లాలో గంజాయి సాగు దాదాపుగా నియంత్రణలోకి వచ్చినప్పటికీ.. ఒడిశా నుంచి అల్లూరి జిల్లా మీదుగా గంజాయి రవాణా అవుతున్న విషయాన్ని గుర్తించామన్నారు. దీంతో ఆ రాష్ట్ర పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆరుగురు వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. గంజాయి రవాణా, వ్యాపారులకు సంబంధించి సమాచారాన్ని తెలియజేసేందుకు 14500 టోల్ ఫ్రీ నంబర్ కూడా అందుబాటులో ఉందన్నారు.

అనకాపల్లి జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులు

అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ గంజాయి రవాణా నియంత్రణ కోసం 24 గంటలు తనిఖీ చేసేందుకు నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచే వాటిని పర్యవేక్షించేలా అనుసంధానం చేశామన్నారు. గతేడాదిలో 224 కేసుల్లో 521 మంది అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇందులో 217 మందిపై సస్పెక్ట్, రౌడీషీట్లు తెరిచామన్నారు. అల్లూరి సీతారామరాజు ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు పూర్తి అదుపులో ఉందన్నారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రోత్సహించేందుకు అవసరమయ్యే విత్తనాలు అందించే విషయమై.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంగా జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నియంత్రణలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పార్వతీపురం మన్యం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ కోరాపుట్, రాయగడ్ నుంచి గంజాయి రవాణా అవుతోందన్నారు. ఆయా ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో గత మూడేళ్లలో కేవలం 8 మంది వినియోగదారులను గుర్తించామన్నారు. ఒడిశా నుంచి గంజాయి రవాణా నియంత్రణ కోసం ఇచ్ఛాపురం, ఆముదాలవలస ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. క్యాంపస్ కాప్స్ పేరుతో విద్యార్థులకు చట్టాలపై ఐదు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. విజయనగరం ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ 19 కేసుల్లో 46 మంది స్థానిక గంజాయి వ్యాపారులను అరెస్టు చేసినట్లు వివరించారు. జిల్లాలో 4 స్టాటిక్, 7 డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెట్టినట్లు చెప్పారు. దీంతో గత నాలుగు నెలల్లో 145 అంతర్ రాష్ట్ర గంజాయి వ్యాపారులను అరెస్ట్ చేశామన్నారు.

బడుగుల బతుకుల్లో విషాదం



కశింకోట వద్ద బోల్తా పడిన ఆటో.. చెల్లాచెదురుగా పడి ఉన్న కూరగాయలు



తలుపులరాజు (ఫైల్)



మునగపాక లక్ష్మి (ఫైల్)



రోదిస్తున్న తలుపుల రాజు కుటుంబ సభ్యులు

- వేకువజామున ఘోర ప్రమాదం
- రెండు కుటుంబాల్లో కల్లోలం

కశింకోట: తెలతెలవారుతుండగానే వారి బతుకులు తెల్లారిపోయాయి. బోల్తా పడ్డ ఆటో, చెల్లాచెదురుగా పడిన కూరగాయలు మృతుల కుటుంబాల్లో రేగిన కల్లోలాన్ని ప్రతిబింబిస్తున్నాయి. కశింకోట వద్ద మంగళవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వీరిద్దరు పేద కుటుంబాలకు చెందినవారే. ఒకరు కశింకోటలోని ఇందిరా కాలనీకి చెందిన కూరగాయల వ్యాపారి మునగపాక లక్ష్మి (52) కాగా, మరొకరు బయ్యవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శనివాడ తలుపులరాజు (32). తెల్లవారుజామున బయ్యవరం గ్రామం నుంచి కూరగాయలు, ప్రయాణికులతో అనకాపల్లికి బయదేరిన ఆటో.. కశింకోట బస్ స్టేషన్ వద్దకు వచ్చేసరికి స్థానిక ఇందిరా కాలనీకి చెందిన కూరగాయల వ్యాపారి మునగపాక లక్ష్మి ఆపారు. ఆగిన ఆటోలోకి లక్ష్మి ఎక్కుతుండగా.. వెనుక నుంచి యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆటో తలకిందులుగా బోల్తాపడి రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీ కాలువపైకి దూసుకుపోయింది. ఆటో డ్రైవర్ తలుపులరాజు, లక్ష్మి తీవ్ర గాయాలతో అక్కడే మృతి చెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న బయ్యవరానికి చెందిన ధనలక్ష్మి తలకు దెబ్బతగిలింది. చలపురెడ్డి సత్యవతి కుడి కాలుకు గాయమైంది. కూరగాయల వ్యాపారి మామిడి లక్ష్మి, కూలీ గుర్రం దుర్గునాయుడు గాయపడ్డారు. వారిని స్థానికులు, పోలీసుల సహకారంతో 108 వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కన్నీరు మున్నీరు

ఆటో డ్రైవర్ తలుపులరాజుకు భార్య స్వాతి, కుమార్తెలు భువనేశ్వరి (9), భవిష్య (7) ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతను మృతి చెందడంతో ఇక తమ కుటుంబానికి దిక్కెవరంటూ భార్య స్వాతి, పిల్లలు రోదిస్తుండటం స్థానికులను కంట తడి పెట్టించింది. మరో మృతురాలు లక్ష్మి కూరగాయల వ్యాపారి. ఆమె సుమారు 8 ఏళ్లుగా అనకాపల్లి వెళ్లి కూరగాయలు తెచ్చుకొని తన ఇంటి వద్ద విక్రయిస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. భర్త లేరు. కుమారుడు శివ ఉన్నారు. పెళ్లి అయింది. లక్ష్మి మృతి ఆ కుటుంబంలో విషాదం నింపింది.

రేపు సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మధురవాడ: ఉమ్మడి విశాఖ జిల్లా సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 11న శ్రీకృష్ణాపురం ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రాంగణంలో జరగనుంది. ఈ సందర్భంగా బాల, బాలికలు, సీనియర్ మహిళా, పురుష జట్లను ఎంపిక చేస్తామని విశాఖ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి రమణ, సూర్యనారాయణ తెలిపారు. జూనియర్ జట్టు ఎంపిక పోటీల్లో పాల్గొనే వారు 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలి. ఒరిజినల్ ఆధార్ కార్డుతో 11వ తేదీ ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలకు హాజరు కావాలి. మరిన్ని వివరాలకు 98856 59016, 94929 00200, 96405 22141లో సంప్రదించవచ్చు.

కుప్పకూలి.. ప్రాణాలు వదిలి



మృతుడి భార్యకు దహన ఖర్చులు అందజేస్తున్న దృశ్యం

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలోని మైలాన్ పరిశ్రమలో కార్మికుడు మంగళవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం నారాయుడుపాలెం గ్రామానికి చెందిన శ్రీను(42) ఫార్మాసిటీలో మైలాన్ పరిశ్రమ యూనిట్-9లో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు విధులకు వచ్చిన శ్రీను కళ్లు తిరుగుతున్నాయని తోటి కార్మికులతో చెప్పిన వెంటనే కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న తోటి కార్మికులు యాజమాన్యానికి సమాచారం అందించడంతో మెరుగైన వైద్యం కోసం అతనిని అంబులెన్స్‌లో నగరానికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం యాజమాన్యం... శ్రీను మృతదేహాన్ని బంధువులకు అప్పగించింది. శ్రీను మృతిపై నారాయుడుపాలెంలో ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయి. మృతుడి కుటుంబానికి నష్టపరిహారంగా రూ.5.50 లక్షలతో పాటు రూ.4 లక్షల గ్యాట్యుటీ, దహన సంస్కారం కోసం రూ.50 వేలు తక్షణమే చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ చెప్పారు. అలాగే మృతుడి భార్యకు పరిశ్రమలో ఉపాధి, ప్రతి నెల పెన్షన్ రూపంలో రూ.15 వేలు చెల్లించనుందని తెలిపారు. ఈ చర్చల్లో ఎంపీటీసీ ఎ.నాగేశ్వరరావు, యాజమాన్య ప్రతినిధి అరవింద్ పాల్గొన్నారు. కాగా కార్మికుడు శ్రీను మృతిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు.

నారాయుడుపాలెంలో విషాదం

మునగపాక: అందరితో మంచిగా ఉండే శ్రీను మృతితో నారాయుడుపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మండలంలోని నారాయుడుపాలెం గ్రామానికి చెందిన శ్రీను(50) ఆరేళ్ల క్రితం పరవాడ ఫార్మాసిటీలోని మైలాన్ కంపెనీలో కార్మికునిగా చేరాడు. ఎప్పటిలాగానే మంగళవారం ఉదయం విధులకు హాజరయ్యాడు. విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురై మృతిచెందాడు. తమకు దిక్కెవరంటూ శ్రీను కుటుంబ సభ్యులు భోరున విలపించారు. మృతుడు శ్రీనుకు భార్య భవాని, ఇద్దరు కుమార్తెలు,కుమారుడు ఉన్నారు. శ్రీను అంత్యక్రియలు బుధవారం నారాయుడుపాలెంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వెండి, బంగారం చోరీ

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం మూడోవీధిలో చోరీ జరిగినట్టు క్రైం ఎస్‌ఐ సింహాచలం మంగళవారం చెప్పారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆ వీధికి చెందిన కరకచర్ల సీతారేవతిలక్ష్మి ఈనెల 6న గాజువాకలో బంధువుల ఇంటికి వెళ్లారు. లక్ష్మి మంగళవారం ఇంటికి వచ్చి చూసి, చోరీ జరిగినట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 20 తులాల వెండి, తులం బంగారం చోరీకి గురైనట్టు బాధితురాలు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

యలమంచిలి: రేగుపాలెం,యలమంచిలి రైల్వే స్టేషన్ మధ్య మంగళవారం రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు.యలమంచిలి ఫైరాఫీస్ కాలనీకి చెందిన బల్లిన జగన్నాథరావు(38) రేగుపాలెం హైవే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని తల, మొండెం వేరయ్యాయి.వసుధ కంపెనీలో రోజు వారీ కూలీగా పని చేస్తున్న జగన్నాథరావు ఆత్మహత్య చేసుకోడానికి గల కారణాలు తెలియరాలేదని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య,కుమారుడు కుమార్తె ఉన్నారు.సమాచారం తెలుసుకున్న వెంటనే తుని రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతదేహానికి శవపంచనామ నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- మార్కెట్‌కమిటీ ఛైర్‌పర్సన్ యశోద



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

అనకాపల్లిటౌన్: ఆరోగ్యకర, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పలకా యశోద అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం జిల్లా అటవీశాఖ అధికారి జి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు కృషిచేయాలని, మొక్కలు నాటడంతో ఆరోగ్యంగా జీవించడమే కాకుండా భావితరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించవచ్చన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి డి.శకుంతల, జెడ్పీ పి.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, అటవీశాఖ సిబ్బంది, ఎస్‌వీడీఎస్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యనారాయణపురంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని సత్యనారాయణపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. మండలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఆదిపురుష్ ట్రైలర్ సంబరాలు


థియేటర్ వద్ద కేక్ కట్ చేస్తున్న ప్రసాద్

అనకాపల్లిటౌన్ : ఆదిపురుష్ చిత్రం విజయాన్ని సాధించాలని హీరో ప్రభాస్ అభిమాన సంఘం వ్యవస్థాపకుడు జీవీఎల్ఎన్ రాజు అన్నారు. స్థానిక సాయిరాం మూవీల్యాండ్ ఆవరణలో ఆదిపురుష్ చిత్ర ట్రైలర్ విడుదల సందర్భంగా మంగళవారం అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ముందుగా థియేటర్ మేనేజర్ ప్రసాద్ కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమానసంఘం సభ్యులు కృష్ణంరాజు, సతీష్‌వర్మ, వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పి.చందు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శ్రీకారం


డ్రైనేజీ పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్ సాలాపు శాంతి

అనకాపల్లిటౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో దశలవారీగా సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. మండలంలోని అక్కిరెడ్డిపాలెంలో డ్రైనేజీ పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. నిర్మాణ సమయంలో ఆయా ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ అధికారులకు, కాంట్రాక్టర్‌కు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాలాపు శాంతి, పార్టీ నేతలు ఎస్.సూరిఅప్పారావు, శీరంశెట్టి పైడిరాజు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 258 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	-----	-----
మొదటి రకం	4,200	5,000
రెండో రకం	3,840	4,200
మూడో రకం	3,300	3,820

అనకాపల్లి సినిమాలు

అరంగేట్రం	రాజా
రామబాణం	సత్యనారాయణ స్క్రీన్-1
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (తెలుగు 3డి)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
ఉగ్రం	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఫ్లైఓవర్‌తో ముంపులో సత్తెమ్మపేట

రోడ్లు వస్తే ఊర్లు బాగుపడతాయని విన్నాం. కానీ ఇక్కడ ఊరు మొత్తం ముంపునకు గురవుతోంది. రాకపోకలకు మార్గం లేకుండా పోయింది. ఊరికి 30 అడుగుల ఎత్తులో వేసిన రోడ్డు వారికి నరకయాతనగా కలిగిస్తోంది. అనకాపల్లి మండలం శంకరం పంచాయతీలోని సత్తెమ్మపేట ప్రజల దుస్థితి ఇది.

- లోతట్టు గ్రామంగా మారిన సత్తెమ్మపేట
- తాజా వర్షాలతో గ్రామాన్ని ముంచెత్తిన ఫ్లైయాష్
- హైవే అథారిటీకి మొరపెట్టుకున్న గ్రామస్తులు


ఫ్లైఓవర్ నిర్మాణంతో లోతట్టుగా మారిన సత్తెమ్మపేట (ఇన్‌సెట్) గ్రామస్తుల రాకపోకలకు ఈ రోడ్డే గతి


గ్రామం మధ్యలో నిలిచిపోయిన వర్షపునీరు

తుమ్మపాల : రోడ్లు విస్తరిస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని అనుకుంటారు. కానీ శంకరం పంచాయతీ, సత్తెమ్మపేట ప్రజలకు మాత్రం కనీస వసుతల్ని కూడా దూరం చేస్తోంది. తాగునీరు కలుషితమైంది. రాకపోకలు సాగించే రోడ్డు ఛిద్రమైంది. చినుకు పడితే గుండెల్లో గుబులు రేగుతోంది. పొడి వాతావరణానికి గాలి తోడైతే కళ్లలో పడే బూడిద నుంచి రక్షణకు కళ్లు మూసుకోవాల్సి వస్తోంది. దీంతో గ్రామస్తులు ప్రత్యామ్నాయం చూపాలంటూ.. అధికారుల వద్ద గగ్గోలు పెడుతున్నారు.

ఫ్లైఓవర్‌తో అవస్థలు

ఈ చిన్న గ్రామంలో సుమారు 50 గృహాలున్నాయి. గ్రామానికి ఇరువైపులా ఏలేరు కాలువ, పులికాలువ విస్తరించి ఉన్నాయి. ఇటీవల అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేశారు. రెండు కాలువల నేపథ్యంలో గ్రామం నుంచి అనకాపల్లి వరకు వంతెన నిర్మించారు. దీనిపై గ్రామానికి దాదాపు 30 అడుగుల ఎత్తున ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు.

అదే గ్రామస్తులకు శాపంగా మారింది. రోడ్డుకు చేరాలంటే అంత ఎత్తుకు ఎక్కాల్సిందే. రోడ్డు విస్తరణతో డ్రైనేజీ, వర్షపు నీరు పోయే మార్గం కూడా మూసుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలో నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ముంచెత్తిన ఫ్లైయాష్

గ్రామాన్ని ఆనుకుని ఉన్న రోడ్డు విస్తరణతో ఊరు రూపురేఖలే మారిపోయాయి. విస్తరణలో కొన్ని ఇళ్లను తొలగించారు. రాకపోకలకు వీలుగా గ్రామానికి రోడ్డును మాత్రం ఇంకా వేయలేదు. ఉన్న రోడ్డును ధ్వంసం చేసారు. ఊరుకు ఆనుకుని ఫ్లైఓవర్ ఏర్పాటుకు వినియోగించిన ఫ్లైయాష్ తాజా వర్షాలకు లోతట్టుగా మారిన సత్తెమ్మపేటను ముంచెత్తింది. వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరుకుంది. తాగునీటి వ్యవస్థ కలుషితమైంది. ఎండలు పెరిగాక పొడిబారిన బూడిదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణంలో భారీ వాహనాల రాకపోకలతో హైవేకు అనుసంధానంగా ఉన్న రోడ్లు మరమ్మతులకు గుర్యాయి. వీటికి సదరు కాంట్రాక్ట్ సంస్థ మరమ్మతులు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు కూడా ఈ రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపాలి



జాతీయ రహదారి విస్తరణలో ఫ్లై ఓవర్ నిర్మాణం సత్తెమ్మపేటకు శాపంగా మారింది. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితిలేదు. ఇటీవల కురిసిన వర్షాలకైతే గ్రామస్తుల బాధ వర్ణనాతీతం. ఊరంతా బురదమయం అయింది. వర్షాకాలం వస్తే మరెన్ని ఇబ్బందులు పడాలో భయమేస్తోంది. అధికారులు స్పందించి, ముంపు నుంచి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– పసుపులేటి లక్ష్మి, సర్పంచ్, శంకరం

అధికారులకు విన్నవించాం



ఇటీవల కురిసిన వర్షాలకు పంచాయతీ మంచినీటి బోరు పూర్తిగా కలుషితం అయ్యింది. జాతీయ రహదారి 30 అడుగుల ఎత్తులో నిర్మాణం జరగడంతో రోడ్డుపనులకు వినియోగించిన బుగ్గి గ్రామంలోకి చొచ్చుకురావడమే కారణం. ముంపు సమస్యపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ తీర్మానం చేసి, జాతీయ రహదారుల సంస్థ స్థానిక అధికారులకు విన్నవించాం.

– బి.జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

జగనన్నకు చెబుదాంతో సమస్యల
సత్వర పరిష్కారం


ఉగ్గినపాలెం ఆర్బీకేలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి, పంచాయతీ, సచివాలయ సిబ్బంది

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం రైతు భరోసా కేంద్రంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని ఎల్ఈడీ టీవీ ద్వారా మంగళవారం ప్రదర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని, కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. కశింకోట ఎంపీడీవో కార్యాలయంలో కూడా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి కార్యాలయ పర్యవేక్షణలో ఈ వ్యవస్థ నడుస్తుందన్నారు. దీంతో సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఏవో ఖాన్, మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధి పథకం, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్యోత్స్నకు అభినందన


జ్యోత్స్నను సత్కరించిన శ్రీరామ వ్యాయామ సంఘ సభ్యులు

అనకాపల్లిటౌన్ : కేరళ రాష్ట్రం అలప్పుజలో జరిగిన జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించిన అడారి జ్యోత్స్నను స్థానిక వేల్పులవీధి శ్రీరామవ్యాయామ సంఘంలో మంగళవారం సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు మాట్లాడుతూ సంఘ సభ్యురాలైన జ్యోత్స్న ఘన విజయం సాధించడం తమకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్కరాజు రమేష్, వీధి పెద్దలు గరికి వెంకటరావు, గుమ్మాల నరసింగరావు, గుమ్మాల నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

'నిత్య జీవితం ఎలక్ట్రానిక్ మయం'

అనకాపల్లిటౌన్ : ఎలక్ట్రానిక్ పరికరాలు మానవుని నిత్యజీవితంతో ముడిపడి ఉన్నాయని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నరసింహం అన్నారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ) అంశంపై వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పెద్దపెద్ద పట్టణాల్లో, అపార్ట్‌మెంట్స్‌లో, భారీపరిశ్రమల్లో ఐవోటీ పద్ధతిని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్‌ను పొదుపు చేసుకునేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యతోపాటు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిఉండాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.హనురతీన్, ఎ.ఎస్.ఎన్.వర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నరసింహం

విద్యార్థులకు కథల పోటీ

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా రెండో రోజు మంగళవారం విద్యార్థులకు కథల పోటీ నిర్వహించారు. ముందు రోజు వినిపించిన కథను రాయించారు. దానికి ముగింపు, శీర్షిక పెట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో పోటీలో చిన్నారి పావని ప్రథమ స్థానంలో నిలిచింది. నిన్న విన్న కథకు బంగారు చేప శీర్షికతో చక్కటి ముగింపు ఇచ్చి కథ రాయడంతో ఉపాధ్యాయులు బి.సురేష్, బి.వి.నరసింహమూర్తి, చిరంజీవి, గాయత్రి స్కూల్ ప్రిన్సిపాల్ వై.నగేష్, గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తదితరులు అభినందించారు. పోటీకి 21 మంది చిన్నారులు హాజరయ్యారు.


తాళ్లపాలెం గ్రంథాలయంలో కథల పోటీకి హాజరైన విద్యార్థులు

వైభవంగా గ్రామదేవతల పండగలు

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం గ్రామ దేవత శ్రీమర్లమాంబ పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు పసుపు కుంకుమలు,చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి దర్శించుకున్నారు. ఆయన వెంట బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు తదితరు లు పాల్గొన్నారు.

రాయపుర అగ్రహారంలో కొలువైనపరదేశిమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రికి అమ్మ వారి అనుపు మహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఆలయం వద్ద సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుతో పాటు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

త్రిపురాంతక స్వామికి పుష్పాంజలి నేడు

కశింకోట : స్థానిక సర్వ మంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించనున్నట్టు అర్చకుడు వి.శంకరం తెలిపారు. వైశాఖ పౌర్ణమి రోజు స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా పుష్పాంజలి జరిపేందుకు సన్నాహాలు చేశామన్నారు. ఈ సందర్భంగా సర్వమంగళాంబ అమ్మవారిని ప్రతిష్ఠించి 108 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 108 దంపతులకు తాంబులం ఇచ్చి, స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

మినిస్టర్ కప్ క్రికెట్ పోటీలకు సన్నద్ధం



తాళ్లపాలెంలో మినిస్టర్ కప్ క్రికెట్ ప్రాక్టీస్‌లో స్థానిక ప్రజా ప్రతినిధులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్లో మినిస్టర్ కప్ క్రికెట్ పోటీలకు ప్రాక్టీస్ శిబిరం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన మూడు జట్లతో విశాఖలోని రైల్వే స్టేడియంలో ఈ నెల 12న మినిస్టర్ కప్ క్రికెట్ పోటీలు జరగనున్నాయి. వీటిలో కశింకోట, అనకాపల్లి పట్టణం, మండలం నుంచి ఒక్కొక్క జట్టు వంతున పాల్గొనాల్సి ఉంది. ఇందుకుగాను మండల జట్టు ప్రాక్టీసును ముమ్మరం చేసింది. క్రికెట్‌లో ప్రవేశం ఉన్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు ఆధ్వర్యంలో ప్రాక్టీస్ శిబిరం జరుగుతోంది. దీనిలో ప్రతిభ చూపిన వారిని గుర్తించి జట్టును ఎంపిక చేసి, పోటీలకు వెళ్లనున్నట్లు సర్పంచ్ తెలిపారు. పోటీలో విజేతలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు.

మరింత వేగంగా సమస్యల పరిష్కారం


ముఖ్యమంత్రి సందేశం వింటున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: ప్రజా సమస్యలను మరింత వేగంగా పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారని ఎంపీడీవో రమేష్ నాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కంటే ఎంతో మెరుగైనదిని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగితో పాటు ప్రభుత్వ శాఖలను బాధ్యులను చేయడం జరుగుతుందన్నారు. సహాయక అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వరకూ పారదర్శకంగా కార్యక్రమాన్ని అమలు చేయడానికి ప్రణాళికా బద్ధంగా రూపకల్పన చేశారన్నారు. అర్హత ఉన్నా సాంకేతిక కారణాల వల్ల లబ్ధిపొందలేకపోతున్నవారికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలకు పథకాలు చేరవేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం నుంచి అదేరకమైన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ మహేష్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీదేవితో పాటు పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

21న 4వ మిస్టర్ ఆంధ్ర పోటీలు

అనకాపల్లిటౌన్ : నెల్లూరు జిల్లా కావలిలో ది ఆంధ్రా బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న 4వ మిస్టర్ ఆంధ్ర పోటీలను నిర్వహించనున్నట్లు ఏబీబీఎఫ్ఏ అధ్యక్ష, కార్యదర్శులు అమరపల్లి కృష్ణాజీ, బాబీలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్, అథ్లెట్ల జట్టు ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. దీంతో వచ్చే నెల 3, 4 తేదీల్లో గోవాలో ఇండియన్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే టీ ఇండియా ఫెడరేషన్ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నట్లు వెల్లడించారు.

పథకాలు వివరించి.. సమస్యలు తెలుసుకుని


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్టు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. వెన్నలపా లెం శివారు గొల్లపేట, హనుమాన్ కాలనీల్లో రెండో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల మతాలు, పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. అటువంటి వ్యక్తిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు, ఎంపీటీసీ వెన్నల అరుణకుమారి, జేసీఎస్ మండల కన్వీనరు వెన్నల సన్యాసిరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజేయ్‌రాజ్, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, ఎంపీడీవో వి.హేమసుందరావు, మండల వ్యవసాయాధికారి సీహెచ్. చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలని వినతి


కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: రావాడ, తానాం, భర్నికం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లకు సంబంధించిన స్థల సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జెడ్పీటీసీ సన్యాసిరాజు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంధుల ఫెడరేషన్, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా గొర్లివానిపాలెం రేషన్ డిపో విభజన, రావాడ రెవెన్యూలో కలిసి ఉన్న ప్రభుత్వ, ఫారెస్టు భూములు 600 ఎకరాలపై జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని విభజించి ప్రజోపయోగాలకు వినియోగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో జగనన్న ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ బందం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, భర్నికం, పి.బోనంగి సర్పంచ్‌లు పెదిశెట్టి పూజాశేఖర్, బండారు కల్పనరాజశేఖర్ ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


ఉపాధి కూలీలకు రసీదులు అందిస్తున్న సర్పంచ్ వాసు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని మల్లవరం, నరేంద్రపురం పరిధిలోని గ్రామీణ ఉపాధి హామీ పనుల్ని సర్పంచ్ పిన్నమరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. రసీదుల్ని అందించారు. చందక శివ, చందక బాబ్జి, వీఆర్‌పీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై అవగాహన

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం ఆంగ్ల భాషపై ఉపాధ్యాయుడు వెంకటఅప్పారావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆంగ్ల వ్యాకరణంపై తర్ఫీదునిచ్చారు.


ఇంగ్లీష్ భాషపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటఅప్పారావు

ఆరోగ్య సమస్యలపై బాలికలకు అవగాహన

సబ్బవరం: మండలంలోని నారపాడు సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్‌కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికలతో పలు రకాల ఆరోగ్య సమస్యలపై చర్చించారు. రక్త హీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, సచివాలయ ఏఎన్ఎం విజయతో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


బాలికలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు


తాము గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ తరగతు ల్లో భాగంగా విద్యార్థులకు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వి.శిరీష తెలిపారు.వంగలి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యా యులు పాణి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో విజ్ఞానం,సృజనాత్మకత మరింత పెరుగుతాయని ఆమె తెలిపారు.కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.